






# సోన్ పెల్లి లో పెళ్లి ఇంట విషాదం

**పెళ్లికి వెళుతూ నిర్మల్ పరిసర ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం**

**ఇద్దరు మృతి, మరొకరి పరిస్థితి విషమం, 20 మందికి గాయాలు**

**క్షతగాత్రులను రిమ్స్ లో పరామర్శించిన బోథ్ ఎమ్మెల్యే**

07



అప్పటివరకు ఆ కుటుంబం అంతా సంతోషంగా ఉన్నారు. ఇక పెళ్లికూతురు ముందు వెళ్లిపోవడంతో వెనుక నుంచి కుటుంబ సభ్యులతో కలిసి గ్రామస్తులు ఎంతో ఆనందంతో పెళ్లికి హాజరయ్యేందుకు బయలుదేరారు. అంతలోనే రోడ్డు ప్రమాదం ముంచుకొచ్చింది. ఆ కుటుంబంలో, గ్రామంలో విషాదాన్ని నింపింది. గ్రామస్తులు బంధువులు వధువు తరపున ఆర్మూర్ లో జరిగే పెళ్లికి బయలుదేరారు. ఐచర్ వాహనంలో దాదాపు 25 మంది బయలుదేరు వెళ్లారు. పెళ్లికి త్వరలో చేరుకుంటామని సమయంలోనే అంతలోనే విషాదం నెలకొంది. మార్గమధ్యంలో నిర్మల్ సమీపంలోని జాతీయ రహదారిపై ఒక్కసారిగా ఆ వాహనం టైరు పగిలింది. దీంతో ఆ వాహనం ఒక్క సారిగా అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదం లో సోంపల్లి గ్రామానికి చెందిన పెళ్లికూతురు బంధువులు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. బోయిన్ వాడు తులసీ దాస్ 46, బోరడే లక్ష్మణ్ 50, లు అక్కడి కక్కడే మృతి చెందగా సాగర్ వాడ బాలాజీ పరిస్థితి విషమంగా ఉండడంతో తక్షణమే అంబులెన్స్ ద్వారా ఆదిలాబాద్ రిమ్స్ కు తరలించారు.







# యువ ఆవిష్కర్తలకు ప్రోత్సాహం

**ఆదిలాబాద్‌లో 'ఇన్నోవేషన్ పంచాయత్' నిర్వహణ**

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ బ్యూరో, మార్చి 12, (ప్రజా జ్యోతి) :** జిల్లాలోని యువ ఆవిష్కర్తలు, విద్యార్థులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల వినూత్న ఆలోచనలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు పనిచేస్తున్న తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు 'ఇన్నోవేషన్ పంచాయత్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన యువత, విద్యార్థులు, ఆవిష్కర్తలు తమ వినూత్న ఆలోచనలను నిపుణుల ముందుంచి మార్గదర్శకత్వం పొందే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర రాజధానికి దూరంగా ఉన్న జిల్లాలలో కూడా ప్రతిభావంతులైన యువతకు సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్థానిక సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలను సూచించే ఆలోచనలు ఉన్నవారు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆవిష్కరణలను వెలికితీయడంలో తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారికి రాష్ట్ర స్థాయి నిపుణుల నుండి ప్రత్యక్ష మార్గదర్శనం లభిస్తుందని తెలిపారు. తమ ఆలోచనల ఆచరణ సాధ్యత పై నిపుణుల ద్వారా ఐడియా వ్యాలిడేషన్ పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే ప్రోటోటైప్ తయారీ, స్టార్టప్ అభివృద్ధి, వ్యాపార విస్తరణకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక మార్గదర్శనం అందిస్తారని వివరించారు. ప్రభుత్వ పథకాలు, ఇంక్యుబేషన్ సెంటర్లు, స్టార్టప్ మద్దతు వ్యవస్థలతో అనుసంధానం చేసే అవకాశమూ కల్పిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే వారు పోస్టర్ లో ఇచ్చిన QR కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా లేదా అధికారిక వెబ్‌సైట్‌లో ముందస్తుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ముందుగా నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని యువత, విద్యార్థులు, ఆవిష్కర్తలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ వినూత్న ఆలోచనలను వాస్తవ రూపంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

# గాంధీభవన్ లో జరిగిన సమావేశానికి బోరంచు శ్రీకాంత్ రెడ్డి

**ఆదిలాబాద్ బ్యూరో, మార్చి 12, (ప్రజా జ్యోతి)**

తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్ రెడ్డి అధ్యక్షతన భారత్–అమెరికా ఒప్పందం, తెలంగాణ వ్యవసాయ రంగానికి జరుగుతున్న నష్టం అంశాలపై గాంధీ భవన్ లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొని కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న రైతు వ్యతిరేక విధానాలతో రైతాంగం పడుతున్న సమస్యలను వివరించారు. పీడీపీఎస్(ప్రైజ్ డెఫిసిటీ పేమెంట్ సిస్టం) అమలుకు పైలెట్ ప్రాజెక్టుగా ఆదిలాబాద్ మార్కెట్ ను ఎంచుకున్నారని, పత్తిని ఎక్కడైనా అమ్ముకోవచ్చని ధరలో వ్యత్యాసాన్ని ప్రభుత్వమే భర్తీ చేస్తుందని చెప్పారు. బియ్యం అమెరికాతో పాటు అరబ్ దేశాలకు ఎగుమతి చేస్తామని, మిగతా ఉత్పత్తులు ఎక్కువ భాగం అమెరికాకే ఎగుమతి చేయడంతో తాజాగా పన్నుల పెంపుతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని అన్నారు. దేశవ్యాప్తంగా విత్తన వ్యాపార రంగంలో భారతీయ బీజ్ సహకారి సమితి లిమిటెడ్ పేరుతో కొత్తగా ప్రవేశిస్తున్న నేపథ్యంలో, దాని వల్ల కలిగే లాభ–నష్టాలపై, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలన్న డిమాండ్, ఇటీవల జరిగిన భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం ప్రభావం, అలాగే కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది.



# పైసా పైసా పోగేసిన డబ్బులు ఇవ్వాలి

- సహారా కార్యాలయం ముందు ఖాతాదారుల నిరసన
- నల్ల బ్యాడ్జీలతో ధర్నా, త్వరగా చెల్లించకపోతే దీక్షలకు హెచ్చరిక

**మంచిర్యాల, 12, మార్చి, (ప్రజా ప్రతినిధి):** మంచిర్యాల జిల్లా సీసీసీ ఎక్స్ రోడ్ వద్ద గల సహారా ఇండియా కార్యాలయం ముందు గురువారం సహారా ఖాతాదారులు ఘన నిరసన చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి, తమ కష్టపడి కూడబెట్టిన డిపాజిట్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రాలు మేనేజర్‌కు అందజేశారు. సింగరేణి విశ్రాంత ఉద్యోగులు, వయోవృద్ధులు, ఒంటరి మహిళలు, కూలీలు, పేద మధ్యతరగతి, చిన్న వ్యాపారులు సహారా సంస్థలో ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో కట్టిన కోట్లాది రూపాయలు ఏజెంట్ల మాయమాటల కారణంగా రాలేదు. పాలసీలు మెచ్యూరిటీ పూర్తయ్యి సంవత్సరాలు గడిచినా డబ్బులు చెల్లించని విషయంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దబాధితుల ప్రకారం, ప్రతి నెల "రండి, మూడు నెలల తర్వాత రండి, ఆరు నెలల తర్వాత రండి" అంటూ సహారా ఆఫీసులు వారిని తిప్పుతూ, ఆన్లైన్‌లో నమోదు చేయాలని, డిపాజిట్ పత్రాల్లో తప్పులు ఉన్నట్లు లాయర్ ద్వారా నోటరీ తీసుకోవాలని సూచిస్తున్నారని తెలిపారు. ఈ కారణంగా వృద్ధులు, మహిళలు, ఖాతాదారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఆవేదనను ఎదుర్కొంటున్నారు.



బాధితులు డిమాండ్ చేశారు మెచ్యూరిటీ పూర్తయిన ఫిక్స్ డిపాజిట్లను వెంటనే చెల్లించాలి. లేదంటే 1015 రోజుల్లో బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాల, నస్పూర్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రిలే నిరాహార దీక్షలు లేదా అమరణ నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సహారా యాజమాన్యంతో చర్చించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, సహారా బాధితులు జి. వెంకట్‌రెడ్డి, పెద్దపల్లి మల్లయ్య, మోతే కాంతయ్య, డి. రాజమౌళి, అంకం సతీష్, రెడవని శంకర్, కే. మల్లయ్య, పిరిపిరెడ్డి అరుణ, నక్షత్ర, మహేష్, మహిళా బాధితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పదవి భార్యది.. అధికారం భర్తది..!

- మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో భర్తల హాజరు చట్టం ఒకటి, అమలు మరోలా




**మంచిర్యాల, 12, మార్చి ( ప్రజా జ్యోతి ):** స్థానిక సంస్థల్లో మహిళలకు రాజకీయ అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో మహిళలకు విస్తృతంగా రిజర్వేషన్లు కల్పించింది. అయితే కొన్ని ప్రాంతాల్లో మహిళలు సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా ఎన్నికైనప్పటికీ అధికార కార్యక్రమాల్లో మాత్రం వారి భర్తలే పాల్గొంటున్న పరిస్థితి కొనసాగుతోంది. దీంతో "పదవి భార్యది.. అధికారం భర్తది" అనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామపంచాయతీ సమావేశాలు, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, అధికారులతో సమీక్షలు, ప్రజల సమస్యల పరిష్కారం వంటి కార్యక్రమాల్లో ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో భర్తలే ముందుండటం అనేక చోట్ల కనిపిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో అయితే అధికారులతో మాట్లాడటం నుంచి నిర్ణయాలు చెప్పేవరకు అన్ని వ్యవహారాలు భర్తలే చూసుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు.

### చట్టం ఏమంటోంది..?

స్థానిక సంస్థల చట్టాల ప్రకారం ప్రజలు నేరుగా ఎన్నుకున్న వ్యక్తే అధికారిక ప్రజాప్రతినిధి. గ్రామపంచాయతీల్లో సర్పంచ్, మున్సిపాలిటీల్లో కౌన్సిలర్, కార్పొరేషన్లలో కార్పొరేటర్‌నే అధికారికంగా గుర్తిస్తారు. సమావేశాల్లో పాల్గొనడం, నిర్ణయాలు తీసుకోవడం, అధికారిక పత్రాలపై సంతకాలు చేయడం వంటి అన్ని అధికారాలు ఎన్నికైన వ్యక్తికే ఉంటాయి. ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో వారి భర్తలు అధికారిక సమావేశాల్లో పాల్గొనడం, అధికారులతో చర్చలు జరపడం వంటి చర్యలకు చట్టపరంగా గుర్తింపు ఉండదు. అధికారికంగా ఆ బాధ్యతలు ఎన్నికైన ప్రజాప్రతినిధులకే పరిమితం అవుతాయి.

### అధికారుల మొహమాటంఠ సమస్య మరింత పెరుగుతుందా..?

అయితే వాస్తవ పరిస్థితుల్లో కొన్నిసార్లు అధికారులు కూడా ఈ విషయంపై కఠినంగా వ్యవహరించకుండా మొహమాటం లేదా స్థానిక ఒత్తిళ్ల కారణంగా మహిళా ప్రజాప్రతినిధుల భర్తలను కార్యక్రమాలకు అనుమతిస్తున్నట్లు సమాచారం. కొన్ని సందర్భాల్లో భయంతో లేదా వివాదాలు రాకుండా ఉండాలన్న ఉద్దేశంతో అధికారులు కూడా ఈ వ్యవహారాన్ని పట్టించుకోకుండా వదిలేస్తున్నారని స్థానిక వర్గాలు చెబుతున్నాయి. ఇలా అధికారుల నిర్లక్ష్యం లేదా సహనం కారణంగా "ప్రాక్సీ పాలన" మరింత బలపడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికైన మహిళలే అధికారికంగా బాధ్యతలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, భర్తల జోక్యం పెరగడం వల్ల మహిళా రిజర్వేషన్ లక్ష్యం పూర్తిగా నెరవేరడం లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### మహిళలే ముందుకు రావాలి

మహిళలకు రాజకీయంగా అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఇచ్చిన రిజర్వేషన్ నిజమైన మహిళా సాధికారతకు దారితీయాలంటే వారు స్వయంగా పాలనలో చురుకుగా పాల్గొనాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. అధికారులు కూడా మహిళా ప్రజాప్రతినిధులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు. మొత్తానికి పదవి మహిళల పేరుతో ఉన్నప్పటికీ, అధికార కార్యక్రమాల్లో భర్తల జోక్యం కొనసాగుతున్న పరిస్థితి స్థానిక పాలనలో చర్చనీయాంశంగా మారింది. మహిళా రిజర్వేషన్ అసలు లక్ష్యం నెరవేరాలంటే ఈ పరిస్థితిలో మార్పు రావాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# బీజేపీపార్టీ రాష్ట్ర మీడియా ప్యానలిస్టుగా నియామకం



**మంచిర్యాలప్రతినిధి మార్చి 11(ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర బీజేపీ మీడియా సెల్‌లో ప్యానలిస్టుగా మంచిర్యాల జిల్లా చెన్నూరు కు చెందిన మహేష్ నామని నియమించారు. ఈమేరకు కేంద్ర మంత్రి జి .కిషన్ రెడ్డి నాయకత్వంలోని పార్టీ నిర్ణయం ప్రకారం రాష్ట్ర మీడియా సెల్ ప్యానలిస్టుగా బాధ్యతలు అప్పగించారు. మహేష్ నామని విద్యార్థి దశ నుంచే అఖిల్ భారతీయ విద్యార్థి పరిషద్ (ఏబీవీపీ) లో చురుకుగా పనిచేశారు. మంచిర్యాల జిల్లాలో ఏబీవీపీ కార్యకలాపాల్లో పాల్గొని, పూర్తి సమయ కార్యకర్తగా అనంతపూర్ తో పాటుగా హైదరాబాదులో సేవలందించారు. అలాగే యూనివర్సిటీ అఫ్ హైదరాబాద్ లో ఏబీవీపీ ఇన్‌చార్జిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. అంతేకాకుండా ఆయన భారతీయ జనతా యువత మోర్చా (బీజేవైఎం) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కూడా గతంలో పనిచేశారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆధ్వర్యంలో తెలంగాణ బీజేపీ స్టేట్ మీడియా సెల్ ప్యానలిస్టుగా మహేష్ నామని ని నియమించారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు,కార్యకర్తలు మహేష్ నామనికి శుభాకాంక్షలు తెలిపారు.

# పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధం!

**మంచిర్యాలరూరల్ మార్చి12(ప్రజాజ్యోతి):** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 14 నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 16 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మంచిర్యాల జిల్లాలో పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల 243,పరీక్షలు రాసే విద్యార్థులు 9 వేల7వందల3 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో గతంలో ఫెయిల్ అయిన 45 మంది విద్యార్థులు కూడా ఈసారి పరీక్షలు రాసే అవకాశం ఉంది. భాషా మాధ్యమాల ప్రకారం చూస్తే తెలుగు మాధ్యమంలో 772 మంది, ఇంగ్లీష్ మాధ్యమంలో 8,844 మంది, ఉర్దూ మాధ్యమంలో 47 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారు. లింగ ఆధారంగా పరిశీలిస్తే జిల్లాలో బాలురు 4,896 మంది, బాలికలు 4,807 మంది ఉన్నారు. ఈ పరీక్షల కోసం జిల్లాలో పలు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు సజావుగా జరిగేలా పర్యవేక్షణ కోసం 48 మంది సీఎస్‌లు మరియు డీఓలు, అలాగే 460 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో పాల్గొననున్నారు. పరీక్షలు మొత్తం 7 పేపర్లు, 6 సబ్జెక్టులతో నిర్వహించబడతాయి. సాధారణంగా ప్రతి పరీక్ష ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతుంది. ఆలస్యంగా వచ్చే విద్యార్థులకు 5 నిమిషాల వరకు మాత్రమే అనుమతి ఇవ్వబడుతుందని అధికారులు తెలిపారు. అలాగే సైన్స్ సబ్జెక్టులోని భౌతిక శాస్త్రం మరియు రసాయన శాస్త్రం పరీక్షలు రెండు భాగాలుగా నిర్వహించబడతాయి. ఈ రెండు భాగాలుగా పరీక్షలు ఉదయం 9:30 గంటల నుండి 11 గంటల వరకు మాత్రమే జరుగుతాయని విద్యాశాఖ అధికారుల నుండి సమాచారం. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన సదుపాయాలు కల్పించడంతో పాటు భద్రతా ఏర్పాట్లు కూడా చేపట్టారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మానసికంగా ధైర్యంగా ఉండి ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా చదివి పరీక్షలు రాయాలని అధికారులు సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ పాటిస్తూ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులు వారిని కోరారు.

# అల్లాం గ్రామంలో గుడుంబా స్థావరాలపై పోలీస్‌ఎక్సైజ్ శాఖల సంయుక్త దాడులు

1500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

70 లీటర్ల నాటుసారా స్వాధీనం

**మంచిర్యాల, 12, మార్చి ( ప్రజా జ్యోతి ):** రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని కోటపల్లి మండలం అల్లాం గ్రామంలో బుధవారం రాత్రి కోటపల్లి పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు సంయుక్తంగా మెరుపు దాడులు నిర్వహించారు. గ్రామంలోని గుడుంబా ప్రభావిత ప్రాంతాల్లో ఇంటింటికీ తనిఖీలు నిర్వహించి గుడుంబా తయారీ కేంద్రాలను గుర్తించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా దాదాపు 1500 లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకుని అక్కడికక్కడే పారబోశారు.అలాగే నలుగురు మహిళల వద్ద నుంచి 70 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ కృష్ణ తెలిపారు.ఈ సందర్భంగా చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ మాట్లాడుతూ, గుడుంబా అనే మహమ్మారి కారణంగా అనేక మంది యువకులు వ్యసనపరులై ప్రాణాలు కోల్పోతున్నారని, దీని వల్ల అనేక కుటుంబాలు నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామంలో ఎవరైనా గుడుంబా తయారీ,విక్రయం లేదా దానికి అవసరమైన ముడి సరుకుల సరఫరా చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే నాటుసారా తయారీలో



ఉపయోగించే పాత్రలు, డ్రమ్ముల విక్రయాలపై కూడా ప్రత్యేక నిఘా ఉంచుతామని స్పష్టం చేశారు.గ్రామాలను గుడుంబా రహితంగా తీర్చిదిద్దేందుకు గ్రామ సర్పంచ్‌లు ముందడుగు వేయాలని, గ్రామస్థుల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి గుడుంబా నిషేధ తీర్మానాలు చేయాలని సీఐ కోరారు. ప్రజలందరూ పోలీసులకు సహకరించి గుడుంబా నిర్మూలనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ దాడుల్లో జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సీఐ సమ్మయ్య,కోటపల్లి ఎస్సై రాజశేఖర్, ఎక్సైజ్ ఎస్సై వెంకటరమణతో పాటు పోలీస్, ఎక్సైజ్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# మార్చి 16న ఛలో హైదరాబాద్ ధర్నాను జయప్రదం చేయండి

అంగన్వాడీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**మంచిర్యాల, 12, మార్చి (ప్రజాజ్యోతి):** అంగన్వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల (మార్చ 16 నిర్వహించనున్న "ఛలో హైదరాబాద్" ధర్నాను విజయవంతం చేయాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం మంచిర్యాల జిల్లా ఐసీడీఎస్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ మల్లేశం కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అంగన్వాడీ ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చిందని, అయితే రెండేళ్లు గడిచినా వాటిని అమలు చేయలేదని విమర్శించారు. అంగన్వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్.ఈ.పి విధానంతో ఐసీడీఎస్ వ్యవస్థను బలహీనపరిచే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్.ఈ.పి అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం



చేయాలని కోరారు. అంగన్వాడీ ఉద్యోగులకు ఫిక్స్ వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించడంతో పాటు ఐసీడీఎస్ కు బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల మాదిరిగా అంగన్వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ఛలో హైదరాబాద్ ధర్నాలో జిల్లాలోని అంగన్వాడీ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భానుమతి, జిల్లా ఉపాధ్యక్షురాలు అనురాధ పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు ఘన వీడ్కోలు

**జైపూర్, మార్చి 12: ప్రజా జ్యోతి:** జైపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పదవ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాలలో విద్యను అభ్యసించి తరువాత ఉపాధ్యాయుడిగా సేవలందించి పదవీ విరమణ పొందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు దత్త కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ఆయనను శాలువా కప్పి ఘనంగా సన్మానించింది.ఈ సందర్భంగా దత్త కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలను సాధించాలని సూచించారు. గురువుల మార్గదర్శకత్వాన్ని పాటిస్తూ లక్ష్యంతో ముందుకు సాగితే విజయాలు సాధించవచ్చని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు తమ చదువులో పట్టుదలతో కృషి చేసి భవిష్యత్తులో మంచి స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభను చూసి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ అధ్యక్షురాలు మద్దుల సునీత, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు గోపాల్, శ్యాం సుందర్ పాల్గొన్నారు.

# రెగ్యులర్ ఈఓను ఏర్పాటు చెయ్యాలి..

**జన్నారం,మార్చ్12(ప్రజాజ్యోతి):** జన్నారం మండల పొన్కల్ మేజర్ గ్రామ పంచాయతీకి రెగ్యులర్ ఈవో ను నియమించాలని వార్డ్ సభ్యుడు ముదుగు ప్రవీణ్ కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొనకల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి పదవి దాదాపు గత 4 సం నుండి ఇంచార్జీ ఈఓ వుండటం వాళ్ళ అనుభవం ఉన్న మరియు రెగ్యులర్ ఈఓ ను ఏర్పాటు చెయ్యాలని, దాని ద్వారా గ్రామ



పంచాయతీ అభివృద్ధి కీ మార్గం సుగమం అవుతుందని అన్నారు. పొన్కల్ గ్రామ పంచాయతీ లో సుమారు 10వేల మంది ప్రజలు ఉన్నట్లు వారి యెక్క ప్రయోజనం దృష్టి లో పెట్టుకొని వారి సౌకర్యార్థం రెగ్యులర్ ఈఓ ను ఏర్పాటు చెయ్యాలని ఆయన జిల్లా అధికారులను కోరారు.

# ఆందోళనకు గురికాకుండా పరీక్షలు రాయాలి.



**జన్నారం,మార్చ్12(ప్రజాజ్యోతి) :** ఈ నెల 14 నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు ఎలాంటి ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు పందిరి మనీష్ విద్యార్థులకు సూచించారు.గురువారం రోజున ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా, మంచిగా చదువుకొని పరీక్షలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రెసిడెంట్ గుర్రపు రిశ్వంత్,విద్యార్థులు పాల్గొన్నారు

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం .

**జన్నారం,మార్చ్12(ప్రజాజ్యోతి):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు కార్యక్రమంలో భాగంగా గురువారం రోజున మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక ఉచిత వైద్యం శిబిరాన్ని ప్రారంభించారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో మంచిర్యాల జిల్లాకు చెందిన స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ అలివేణి, కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ శిల్ప, కీళ్ళు, ఎముకల స్పెషలిస్ట్ డాక్టర్ ప్రవీణ్ విద్యాసాగర్, జనరల్ ఎండి సాయి పవన్, పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ స్వాతి లు పలువురికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ఉమశ్రీ,డాక్టర్ లక్ష్మీ మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు



# గ్రామాభివృద్ధికి ప్రజాప్రతినిధులు కీలకం: కలెక్టర్

**ప్రజల సమస్యల పరిష్కారానికి ముందుండాలి: కలెక్టర్ హరిత**

**సర్పంచులు, కౌన్సిలర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం**



**ఆసిఫాబాద్ టౌన్ మార్చ్ 12 ప్రజా జ్యోతి :** జిల్లా కలెక్టరేట్‌లో గురువారం నూతనంగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పాలనప్రగతి ప్రణాళికపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మీ, అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి జిల్లా కలెక్టర్ కె. హరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్య, ఆరోగ్యం, పచ్చదనం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలపై స్పష్టమైన లక్ష్యాలతో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన పనులు, ప్రజాప్రతినిధుల బాధ్యతలు, ప్రభుత్వ పథకాల అమలు విధానాలపై అధికారులు సర్పంచులు, కౌన్సిలర్లు కు వివరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా పని చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన 10 ప్రధాన అంశాలపై రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను ఈ సందర్భంగా అధికార యంత్రాంగం వివరించింది. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్లు మెంగ్రే ఆకాశ్, షాహిద్ సుల్తానా, డీపీవో భిక్షపతి, డీఆర్‌డీఓ దత్తారావు, సీపీఓ లక్ష్మీనారాయణతో పాటు సర్పంచులు, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామపంచాయతీ కి పక్క భవనాలు

**గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే**

**జన్నారం,మార్చ్12(ప్రజాజ్యోతి):** జన్నారం మండలం చింతల పల్లె , చింతగూడ లలో నూతన గ్రామ పంచాయతీ భవనాలను గురువారం రోజున నిర్మల్ డిసిసి అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రారంభించారు. చింతగూడ , చింతలపల్లి సర్పంచ్ లను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో ప్రతి గ్రామం అభివృద్ధి చెందుతుందని , ప్రతి గ్రామ పంచాయతీకి పాలన కొరకై ప్రత్యేక పక్క భవనాలు ప్రభుత్వం ఇస్తుంది అన్నారు . మనం గెలిచాక పెండింగ్ లో ఉన్న చాలా నిర్మాణాలు, రోడ్లు పూర్తి చేశాం అన్నారు. ప్రభుత్వం చేస్తున్న అబివృద్ధి ప్రజలకు తెలియజేసే బాధ్యత స్థానిక ప్రజా ప్రతినిధులకు ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లు పంజాల



సురేష్,సుతారి సుమలత వినయ్ ,వార్డ్ సభ్యులు , కాంగ్రెస్ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అడవులు, వన్యప్రాణుల సంరక్షణలో మీడియా పాత్ర కీలకం: డిఎఫ్ ఓ నీరజ్ కుమార్ టెబ్రివాల్

**ఆసిఫాబాద్ టౌన్ మార్చ్ 12 ప్రజా జ్యోతి :** ఆసిఫాబాద్: అడవులు, వన్యప్రాణుల సంరక్షణలో మీడియా పాత్ర ముఖ్యమని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా డిఎఫ్ ఓ నీరజ్ కుమార్ టెబ్రివాల్ గురువారం పేర్కొన్నారు. సిర్పూర్ రేంజ్ పరిధిలోని మాకిడి సెక్షన్ లో వన్యప్రాణుల సంరక్షణపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. డిఎఫ్ ఓ తెలిపారు, సిర్పూర్ రేంజ్‌లోని ఇటిక్యాల పహాడ్ లో వెయ్యి ఎకరాల్లో ప్లాంటేషన్ ఏర్పాటుచేశారు. ప్రాణహిత నది పరిసర ప్రాంతం కావడంతో, పులుల ఆవాస కేంద్రంగా ఇటిక్యాల పహాడ్ పరిణమించింది. మహారాష్ట్ర అడోభ అటవీ ప్రాంతం నుంచి పులులు ఇక్కడికి వస్తున్నట్టు చెప్పారు. అడవుల సంరక్షణ మరియు అభివృద్ధికి అటవీ అధికారులు నిరంతరం చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. తర్వాత ఎఫ్ డి ఓ అప్పయ్య మాట్లాడుతూ, ఇటిక్యాల పహాడ్ పులుల ఆవాస కేంద్రంగా ఉందని, అడవుల సంపదను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. కాగజ్ నగర్ డివిజన్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నట్లు వివరించారు. ప్రజలు అటవీ అభివృద్ధికి సహకరించాలని కూడా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బి వెంకట్, ట్రైన్ ఐఎఫ్ఎస్ ఆఫీసర్ భార్గవ్, బెజ్జూర్ రేంజ్ అధికారి ముసవీర్, డిప్యూటీ రేంజ్ అధికారి శ్రావణ్ కుమార్, మాకేడి సెక్షన్ అధికారి వల్క మోహన్రావు, అలాగే కాగజ్ నగర్ డివిజన్ పరిధిలోని రేంజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**జన్నారం,మార్చ్12(ప్రజాజ్యోతి):** జన్నారం మండలంలోని చింతగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని గురువారం రోజున ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ ప్రజలకు పాలనను చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని,గ్రామాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుతారి సుమలత వినయ్ గ్రామంలో ఉన్న పెండింగ్ సమస్యలను తాగునీరు మరియు రిక్వెస్ట్ బస్ స్టాప్ డ్రైనేజీ వసతుల అవసరాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమర్ షరీఫ్, పంచాయతీ కార్యదర్శి మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆదర్శ క్రీడా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన కలెక్టర్ హరిత**



**ఆసిఫాబాద్ టౌన్ మార్చ్ 12 ప్రజా జ్యోతి:** జిల్లా కేంద్రంలోని ఆదర్శ క్రీడా పాఠశాలను జిల్లా కలెక్టర్ కె. హరిత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగది, స్టోర్‌రూమ్, పాఠశాల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. వంటగదిలో తయారుచేసిన అల్పాహారాన్ని స్వయంగా పరిశీలించిన కలెక్టర్, ఆహారాన్ని రుచి చూసి నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. క్రీడా విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు సమయానికి పౌష్టికాహారం అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. పాఠశాలలో పరిశుభ్రత, ఆహార నాణ్యత, విద్యార్థుల వసతి సదుపాయాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# పశువైద్య శాఖ ఆధ్వర్యంలో గాలి కుంటు నివారణ టీకాలు

**ఆసిఫాబాద్ టౌన్ మార్చ్ 12 ప్రజా జ్యోతి:** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని తేజాపూర్ గ్రామపంచాయతీలో పశువైద్య మరియు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని మండల పశువైద్య అధికారి డాక్టర్ శరణ్య పర్యవేక్షించారు. డాక్టర్ శరణ్య మాట్లాడుతూ, పశువుల ఆరోగ్య రక్షణకు ఈ టీకా చాలా అవసరమని తెలిపారు. రైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది గణపతి, రాజు, నరేష్, వినోద్, లలాజీ పాల్గొని పశువులకు టీకాలు వేశారు. అలాగే గ్రామస్తులు మనోహర్, సురేష్, బిక్కు, రవీందర్, శంకర్ తదితరులు హాజరయ్యారు.

# ఎస్సీ సమాజం ఐక్యంగా ముందుకు సాగాలి

- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి
- జనాభా నిష్పత్తిలో ఎస్సీలకు కాంట్రాక్టుల్లో అవకాశాలు కల్పించాలి

**మంచిర్యాల, 12, మార్చి ( ప్రజా జ్యోతి ):** రాష్ట్రంలోని ఎస్సీ సమాజం అన్ని రంగాల్లో న్యాయం సాధించాలంటే ఐక్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డా. జీ. వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో గురువారం టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్‌గా కవ్వంపల్లి సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ సెల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కవ్వంపల్లి సత్యనారాయణపై పెద్ద బాధ్యత ఉందని అన్నారు. ఈ అవకాశాన్ని ఎస్సీ సమాజం సమగ్ర అభివృద్ధికి ఉపయోగించుకోవాలని పార్టీ నాయకులు ఆశిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీలకు వారి జనాభాకు అనుగుణంగా వ్యాపారం, కాంట్రాక్టులు మరియు ఇతర రంగాల్లో అవకాశాలు కల్పించాలని మంత్రి పేర్కొన్నారు. సమాన అవకాశాలు, ఆర్థికాభివృద్ధి ద్వారానే దళితులపై ఉన్న వివక్షను పూర్తిగా తొలగించవచ్చని ఆయన



అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ దళితుల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కార్పొరేషన్లు, ఇతర సంస్థల్లో దళితులకు మరిన్ని అవకాశాలు కల్పించే దిశగా ఎస్సీ నాయకులు అందరూ ఐక్యంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీ సెల్ ప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రోగ్రెసివ్ మైన్ క్లోజర్ తనిఖీలు

- పర్యావరణ పరిరక్షణ చర్యలపై సంతృప్తి
- శ్రీరాంపూర్ ఏరియాలో ఐకే ఓసీ, ఐకే1ఏ గనుల్లో పర్యటన

**మంచిర్యాల, 12, మార్చి (ప్రజాజ్యోతి):** ప్రోగ్రెసివ్ మైన్ క్లోజర్ కార్యక్రమంలో భాగంగా ఓఎస్‌డీ (సీసీఓ, ఎంటీసీ) ఎ. కృష్ణమోహన్ ఆధ్వర్యంలోని వెరిఫికేషన్ బృందం గురువారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలో పర్యటించింది. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ ఆయనను కార్యాలయ ఛాంబర్‌లో శాలువాతో సత్కరించి పూల మొక్కను అందజేశారు. శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ఐకే ఓసీ, ఐకే1ఏ గనుల్లో ప్రోగ్రెసివ్ మైన్ క్లోజర్ కార్యక్రమంలో చేపడుతున్న చర్యలను బృందం సభ్యులు పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి కొనసాగుతూనే మైనింగ్ పూర్తయిన ప్రాంతాలను పర్యావరణహితంగా పునరుద్ధరించే ప్రక్రియను ప్రోగ్రెసివ్ మైన్ క్లోజర్‌గా పరిగణిస్తారు. గని కార్యకలాపాలు కొనసాగుతూనే మట్టి నింపడం, చెట్లు నాటడం వంటి చర్యల ద్వారా మైనింగ్ పూర్తయిన భూమిని సాధారణ స్థితికి తీసుకురావడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఈ క్రమంలో ఐకే ఓసీ, ఐకే1ఏ గనుల పరిసరాల్లో చేపడుతున్న పర్యావరణ



పరిరక్షణ చర్యలను వెరిఫికేషన్ బృందం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. ఐకే గ్రూప్ ఏజెంట్ ఏ.వి.రెడ్డి గని పరిసరాల్లో జరుగుతున్న పనులను బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కార్పొరేట్ ఎన్విరాన్మెంట్ విభాగం అడిషనల్ మేనేజర్లు తిరుపతి, శంకర్, బాబ్జీలు, కార్పొరేట్ ఎస్ఎస్‌వో వై.యాదగిరి, శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం (ఫారెస్ట్) హరినారాయణ, ఐకే ఓసీ మేనేజర్ నాగన్న, ఐకే1ఏ మేనేజర్ కోటయ్య, ఏరియా ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ హనుమాన్ గౌడ్, ఐకే ఓసీ అండర్ మేనేజర్లు పి.వి.రామానాయుడు, చంద్రశేఖర్, సీనియర్ సర్వే ఆఫీసర్లు రాంమోహన్, ప్రసాద్ వర్మ పాల్గొన్నారు.

# అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ఆశా వర్కర్ల వేతన డిమాండ్

- రూ.18,000/- ఫిక్సడ్ వేతనం, ఎన్ హెచ్ ఏం నిధులు పెంచాలని వినతిపత్రం
- 28 వేల ఆశా వర్కర్లు 20 సంవత్సరాలుగా పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారు
- వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇన్సూరెన్స్ హామీలు ఇంకా అమలు కావడం లేదు

**ఆసిఫాబాద్ టౌన్ మార్చ్ 12 ప్రజా జ్యోతి :** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గారికి వినతిపత్రం సమర్పిస్తూ, ఆశా వర్కర్లకు రూ.18,000/- ఫిక్సడ్ వేతనం నిర్ణయించమని, ఎన్ హెచ్ యం కు సరిపడా నిధులు కేటాయించాలని కోరారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వెలిశాల క్రిష్ణమాచారి మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 28 వేల ఆశా వర్కర్లు పేద ప్రజలకు సేవలు అందిస్తున్నప్పటికీ, చట్టబద్ధ సౌకర్యాలు లేక, వేతనం, ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి హామీలు ఇంకా అమలు కాకపోవడం వారి సమస్యలని గుర్తించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు స్వరూప్, యూనియన్ నేతలు బోరే అనిత, ఆర్ నవీన, యశ్మిని, లక్ష్మి, నిర్మల, రేణుక, ఎం దేవి, చంద్రకళ, ఎన్ అరుణ, కళావతి, లావణ్య, సునీత తదితరులు పాల్గొన్నారు.





## నిషాని గ్రామంలో జరిగిన వివాహ వేడుకకు హాజరు నవ దంపతులకు ఆత్రం సుగుణక్క శుభాకాంక్షలు

**కేరమేరి మార్చ్ 12 ప్రజా జ్యోతి :** కెరమెరీ మండలంలోని నిషాని గ్రామంలో ఘనంగా జరిగిన వివాహ వేడుకకు జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేకంగా వధూవరులు ఈశ్వరి-శ్రీనివాస్ దంపతులను శుభాకాంక్షలతో కేంద్రీకరించారు. వధూవరుల దాంపత్య జీవితం ఆనందం, సుఖసంతోషాలతో, పరస్పర అవగాహనతో కొనసాగాలని ఆమె ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో వధూవరులకు ఆశీస్సులు అందించి, వారి భవిష్యత్తు ఉండాలని కోరారు. ఈ సందర్భంలో ఆమె మాట్లాడుతూ, మన సంస్కృతిలో కుటుంబ వ్యవస్థకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, కొత్తగా దాంపత్య జీవితం ప్రారంభిస్తున్న వధూవరులు పరస్పర గౌరవం, ప్రేమాభిమానాలతో జీవితం ముందుకు నడిపించాలని సూచించారు.ం

# ఆన్‌లైన్‌లోనే గ్యాస్ సిలిండర్ బుకింగ్ చేయాలి

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రావు

**మంచిర్యాల, 12, మార్చి ( ప్రజా జ్యోతి ):** గ్యాస్ వినియోగదారులు సిలిండర్ బుకింగ్‌ను తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారానే చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు సూచించారు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఉన్న తన కార్యాలయంలో ఎల్పీజీ డీలర్లతో అత్యవసర సమావేశం ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాస్ కంపెనీల సేల్స్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి జిల్లాలో గ్యాస్ సరఫరా పరిస్థితిపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో గృహ అవసరాల కోసం వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల కొరత ఏమీ లేదని తెలిపారు. వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీలు లేదా గోదాముల వద్దకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లోనే సిలిండర్ బుక్ చేసుకోవాలని సూచించారు. గ్యాస్ బుకింగ్ వ్యవధి సింగిల్ సిలిండర్ వినియోగదారులకు 25 రోజులు, డబుల్ సిలిండర్ వినియోగదారులకు 30 రోజులు ఉంటుందని చెప్పారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో వినియోగదారులు డెలివరీ బాయ్‌కు ఓటీపీ చెప్పి సహకరించాలని కోరారు. హోటళ్లు, రెస్టారెంట్లలో తప్పనిసరిగా వాణిజ్య సిలిండర్లు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డొమెస్టిక్ సిలిండర్లు వినియోగించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్యాస్ సిలిండర్ల విషయంలో ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌లో విక్రయించేందుకు ప్రయత్నిస్తే నిత్యావసర సరుకుల చట్టం1955 కింద చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎల్పీజీ వినియోగదారులు కెవైసీ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని సూచించారు. గ్యాస్ ఏజెన్సీల వద్ద, ఆన్‌లైన్‌లో, గ్యాస్ కంపెనీల అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా, అలాగే గ్యాస్ సిలిండర్ పంపిణీ సమయంలో కూడా కెవైసీ పూర్తి చేసుకోవచ్చని తెలిపారు.ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, ఎల్పీజీ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



# పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ



**ఆసిఫాబాద్ టౌన్ మార్చ్ 12 ప్రజా జ్యోతి :** కొమురం భీం జిల్లా కేంద్రంలోని వాంకిడి మండలంలోని కిరిడీ జె పి ఎస్ ఎస్ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు చదువులో సౌకర్యం కల్పించే విధంగా పెన్నులు, వాటర్ బాటిళ్లు, ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ చేయబడినాయి. ఈ కార్యక్రమం విద్యార్థుల చదువు ప్రగతికి సహకరించడానికి, పరీక్షల సమయంలో సౌకర్యాన్ని కల్పించడానికి ఏర్పాటు చేయబడింది. కార్యక్రమాన్ని వాంకిడి మండల ఎస్సై మహేంద్ర ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ విభాగం నిర్వహించింది.ఎస్సై మహేంద్ర మాట్లాడుతూ: “విద్యార్థులు చదువుకు ప్రత్యేక శ్రద్ధ వహించి, కష్టపడుతూ, ఇష్టంతో చదివి, ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలి.”కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కొట్రంగే సాగర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. అధికారులు ఈ విధమైన కార్యక్రమాలు చిన్న వయసులోనే విద్యార్థుల్లో పాఠశాల మరియు చదువుపై ఆసక్తిని పెంపొందించడంలో ముఖ్యమని, పరీక్షలకు సౌకర్యాలతో ఎదుర్కోవడం వారి భవిష్యత్తులో విద్యాసాఫల్యానికి దోహదం చేస్తుందని తెలిపారు.

# మంచిర్యాల నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం



**మంచిర్యాల, మార్చి 12 (ప్రజా జ్యోతి):** నగర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ పిలుపునిచ్చారు. గురువారం మంచిర్యాల నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ ధర్ని మధుకర్ అధ్యక్షతన నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగర అభివృద్ధికి సంబంధించిన పనులు వేగవంతం చేయాలని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహ రించాలని సూచించారు. నగరంలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రహదారుల మరమ్మతులు, డ్రైనేజీ సమస్యలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అభివృద్ధి పనులు సమయానికి పూర్తి కావాలంటే అధికారులు, కార్పొరేటర్లు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మేయర్ అన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్‌కు సంబంధించిన 24 అంశాలపై కూలంషంగా చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో నగర కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ కమిషనర్ జి. అన్వేష్, అసిస్టెంట్ కమిషనర్ రాజమోహన్, మేనేజర్ కరుణాకర్, టి పీఓ సంపత్, టౌన్ ప్లానింగ్ అధికారులు, డిప్యూటీ ఈఈ రాజేందర్, రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, నగరపాలక సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సిర్పూర్ (టి)ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని ఇటిక్యాల పహాడ్ ప్లాంటేషన్ అడవిలో వన్యప్రాణి సంరక్షణ



**మార్చ్12, సిర్పూర్(టి)నియో జకవర్గం.ప్రజా జ్యోతి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నియోజకవర్గ హెడ్ కోటర్ 001, సిర్పూర్(టి) ఫారెస్ట్ రేంజ్ పరిధి లోని ఇటుకల పహాడ్ ప్లాంటేషన్స్ లో అటవీ శాఖ ఆధ్వర్యంలో మీడియా సెన్సిటైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వన్యప్రాణి సంరక్షణ, ఫోటోల ప్రదర్శన,ఆవాసాల పునరుద్ధరణ, అటవీ అభివృద్ధి పనుల సందర్శన పై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధు లకు వివరించి విశ్లేషించి క్రుప్తుకరించి అవగాహన కల్పించారు.అడవి ప్రాంతంలో అమర్చిన కెమెరా ట్రాప్ ద్వారా వన్యప్రాణులకు దాహార్తికి ఏర్పాటు చేసిన చెక్కు డ్యామ్, సోలార్, నీటి కుంటలు,ప్రత్యక్షం గా చూపెట్టారు.మహారాష్ట్ర నుండి ఇటిక్యాల పహాడ్ అడవి లోకి పులులు ప్రవేశించే ప్రాంతాన్ని సందర్శనాలో వివరించారు.పులుల పాద ముద్రలు, టైగర్ ట్రాకింగ్ చేస్తున్న విధానాన్ని పరిశీలనలో వివరించారు. వన్యప్రాణులకు అనువైన ఆవాసాన్ని కల్పిస్తున్న ప్రాంతాలను చూపెట్టారు. భవిష్యత్తు ప్రణాళికలపై పలు సూచనలు చేశారు. బేస్ వాచర్ల విధుల నిర్వహణ అడవులను కాపాడేదెందుకు ఎదుర్కొంటున్న సవాలు వారు చేస్తున్న కృషిని వివరించారు. అడవులు పచ్చగా ఉండడానికి వారు చేస్తున్న శ్రమ కీలకమనిఅన్నారు. అనంతరం. డీఎఫ్ఓ నీరజ్ కుమార్ టిబ్రీవాల్ మాట్లాడుతూ...ఇటిక్యాల పహాడ్ అడవిలో తడోబా లాగా సఫారీ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇటిక్యాలపహాడ్ అడవి ప్రాంతం లో సహజ సిద్ధమైన నీటి వనరులు ఉన్నట్లు తెలిపారు. అటవీ సంపదను కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.జిల్లాలో 1700 ఎకరాలు ప్లాంటేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇటిక్యాల పహాడ్ గ్రామంలో 1000 ఎకరాలు ప్లాంటేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభివృద్ధికి అవసరమైన ఆర్థిక వనరులు చేకూరుతాయని అన్నారు. ఈ ప్రాంతంలో వన్యప్రాణులకు ఒక రెస్టారెంట్ గా ఉపయోగ పడుతుందని అన్నారు.వన్య ప్రాణుల సంరక్షణ కోసం ప్రత్యక్షంగా సోలార్, బోర్ వెల్, సార్సార్, ఫీట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.బెజ్జూర్ మండలంలో మూడు సోలార్ బోర్వెల్ వేయించినట్లు తెలిపారు గిరిజన గ్రామాల్లో ఉచితంగా గ్యాస్ రిఫిలింగ్ చేపడుతున్నట్లు తెలిపారు.వేంపల్లి,గుండెపల్లి గ్రామాలు ప్రభుత్వం ఏ కోర్టు టూరిజం మంజూరు చేసిందని అన్నారు. ఇటిక్యాల పహాడ్ గ్రామంలో 120 కుటుంబాలు నివసిస్తున్నట్లు తెలిపారు. ఇటుకల పహాడ్ బీట్ పరిధిలో ప్లాంటేషన్ ఏర్పాటుకు కృషి చేసిన మాకిడి సెక్షన్ అధికారి వల్కమ్ మోహన్ రావు ను అభినందించారు.ఈ కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్, ఐఎస్ఎఫ్ అధికారి భార్గవ్,రేంజ్ అధికారులు సెక్షన్ అధికారులు బీట్ అధికారులు అటవీశాఖ సిబ్బంది, జిల్లాలోని ప్రింట్అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు పెన్నులు వాటర్ బాటిల్ల పంపిణీ

**కొమురం భీం జిల్లా ప్రతినిధి మార్చ్ 12 ప్రజా జ్యోతి:** కొమురం భీం జిల్లా కేంద్రంలోని వాంకిడి మండల కిరిడీ జె పి ఎస్ ఎస్ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పోలీస్ మీకోసం కార్యక్రమంలో భాగంగా వాంకిడి మండల ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు వాటర్ బాటిల్లు ఎగ్జామ్ ప్యాడ్ ల పంపిణీ ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువు పట్ల విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ వాయిస్తూ కష్టపడుతూ ఇష్టంగా చదువుతూ ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కొట్రంగే సాగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 58 వ డివిజన్ సమస్యలపై మేయర్ కు వినతి..



**మంచిర్యాల, 12, మార్చి,( ప్రజా జ్యోతి ):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 58 వ డివిజన్ బిజెపి కార్పొరేటర్ బొట్ల అనిత కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ ను కలిశారు. తమ డివిజన్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. తను డివిజన్లో దోమల బెడద పెరిగిందని డ్రైనేజీ పూడిక పూడికలు సరిగా తీసివేయకపోవడమే కారణమని ఆమె తెలిపారు. అదేవిధంగా వీధిలైట్లు సరిగా వెలగడం లేదని, బోర్లు సరిగా పనిచేయడం లేదని, తన డివిజన్ లో ఉన్న పార్కు నిర్వహణ అధ్వానంగా మారిందని ఇలా పలు ప్రజల సమస్యలను మేయర్ కు తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తొందరగా ఈ సమస్యలు పరిష్కారం కోసం చేయాలని కార్పొరేటర్ అనిత కోరారు.

# రంజాన్ మాసం ఐక్యత, సోదరభావానికి ప్రతీక: సుగుణక్క

**సమాజంలో ఐక్యత, సామరస్యంతో ముందుకు**



**ఆసిఫాబాద్ టౌన్ మార్చ్ 12 ప్రజా జ్యోతి :** ఆసిఫాబాద్ పట్టణంలోని రోజ్ గార్డెన్‌లో ప్రభుత్వం తరఫున నిర్వహించిన ఇఫ్తార్ విందులో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విట్టల్, జిల్లా కలెక్టర్ కె. హరిత, కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇన్చార్జ్ అజ్మీర శ్యామ్ నాయక్, మార్కెట్ కమిటీ ఛైర్పర్సన్ ఇరుకుల మంగ, మాజీ డీసీసీ అధ్యక్షులు విశ్వ ప్రసాద్ రావు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మరియు పలువురు మత పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ, రంజాన్ మాసం పరస్పర ప్రేమ మరియు సోదరభావానికి ప్రతీకగా ఉందని తెలిపారు. సమాజంలో ఐక్యత, సామరస్యంతో ముందుకు సాగాలని ఆమె ప్రజలను కోరారు. క్రమంగా అభివృద్ధి, సమాజిక సమరస్యం, మరియు సామాజిక సమన్వయం కోసం ఇలాంటి కార్యక్రమాలు కీలకమని ఆమె అన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, మరియు స్థానికులు హాజరయ్యారు.

## నావేగూడలో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం



**ఆసిఫాబాద్ టౌన్ మార్చ్ 11 ప్రజా జ్యోతి :** పశువైద్య మరియు పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో నావేగూడ గ్రామంలో గాలి కుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల పశువైద్య అధికారి డాక్టర్ శరణ్య మేడం సమన్వయంతో చేపట్టారు. కార్యక్రమాన్ని నావేగూడ సర్పంచ్ మడవి శేకు మరియు ఉప్ప సర్పంచ్ బెందరే మురళిదార్ ప్రారంభించి, పశువుల ఆరోగ్య పరిరక్షణలో టీకాల ప్రాముఖ్యతను హైలైట్ చేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో మండల పశువైద్య సిబ్బంది గణపతి, రాజు, నరేష్, వినోద్, లాలజి పాల్గొని పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. అలాగే, గ్రామస్థులు మాజీ ఉప్ప సర్పంచ్ వాడయి శంకర్, చౌరె వెంకటేష్, లెండిగురే కోండు, శేండె శ్రీరాం, శేండే శ్రీకాంత్, శేండే సతిష్, వాడయి రాము తదితరులు హాజరయ్యారు. నిర్వాహకులు తెలిపారు, ఈ కార్యక్రమం ద్వారా పశువుల ఆరోగ్యం మెరుగుపడడంతో రైతులకు ఆర్థిక నష్టం తగ్గుతుందని.తెలిపారు

# సోన్ పెల్లి లో పెళ్లి ఇంట విషాదం

అందులో మారో 20 మంది వరకు గాయాల య్యాయి. వీరందరి నీ ఆదిలా బాద్ రిమ్స్ ఆస్పత్రి కి తరలిం చి చికిత్సలు నిర్వ హిస్తున్నా రు. సోన్ పెల్లి గ్రామంలో ఒక్క సారిగా రోడ్డు ప్రమాదం వార్త విన్న గ్రామస్తులు ఉలిక్కి పడ్డా రు. ఎవరికి గాయాలయ్యా యి, ఎంత మంది మృతి చెం దారు, ఆరా తీయడం లోనే మునిగి తెలి యా దారు. గ్రా మంలో ఎక్కడ చూసినా ఒక రి నొకరు ఈ ప్రమాదం గురిం చే చర్చించు కోవడం కనిపిం చింది.

**క్షతగాత్రులను పరామర్శించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

ధైర్యంగా ఉండండి అండగా ఉంటా మెరుగైన వైద్యం అందించా లని డాక్టర్లకు ఆదేశం సిరికొండ మండలంలోని సోన్ పెల్లి గ్రామస్తులకు నిర్మల్ జిల్లా కొండాపూర్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గాయపడి న సందర్భంగా ఇద్దరు మృతి చెందగా మిగితా 21 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారి ని ఆదిలాబాద్ రిమ్స్ ఆసుప త్రికి తరలించారు.ఈవిషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే



అనిల్ జాదవ్ తక్షణమే రిమ్స్ ఆసుపత్రికి చేరుకొని వారిని ప రామర్శించారు. నాణ్యమైన వైద్యం అందించాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ని ఆదే శించారు. ఎవరు అధైర్య పడా ద్దని అండగా ఉంటామని భరో సా కల్పించారు. వీరి వెంట ఆయా మండలాల నాయకు లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తా

**నేరడిగొండ మార్చి 12( ప్రజాజ్యోతి ):** నేరడిగొండ మండలంలోని బోరిగాం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు ఇళ్లు మరియు రెండు కొట్టంలు పూర్తిగా కాలిపోవడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ వెంటనే గ్రామానికి చేరుకుని స్థానిక సర్పంచ్ వినేష్ తో కలిసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన కుటుంబాలను ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. బాధితుల పరిస్థితిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వారికి తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే ఇల్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా కొత్త ఇళ్లు మంజూరు చేయించేందుకు జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు తో మాట్లాడి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్తులు కూడా బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని ఆడే గజేందర్ కోరారు. గ్రామ సర్పంచ్ రాథోడ్ వినీష్,గ్రామ నాయకుడు పవర్ మున్నా మహారాజ్, రాథోడ్ మోహన్,రాథోడ్ మదన్ సింగ్, పవర్ సోవన్,రాథోడ్ పూల్ సింగ్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, యండి సద్దాం,జాదవ్ పవన్,రాథోడ్ సందీప్,రాథోడ్ గులాబ్ సింగ్, రాథోడ్ సాయి గ్రామస్తులు ఉన్నారు.





## ప్రజల నాయకుడు ఖానాపూర్ ఎమ్మెల్యే

**జన్నారం,మార్చ్12(ప్రజాజ్యోతి):** జన్నారం మండలం మల్యాల గ్రామస్తులు గురువారం ఉదయం ఉట్నూర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. వారి సమస్య తెలుసుకొని మీరు గ్రామానికి వెళ్ళండి నేనే మీ ఊరికి వస్తా అని ఎమ్మెల్యే మాటిచ్చారు.ఇచ్చిన మాట ప్రకారం సాయంత్రానికి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మల్యాల గ్రామానికి ద్విచక్ర వాహనం పై చేరుకొని గ్రామస్తులతో కూర్చొని వారి సమస్య తెలుసుకున్నారు . వారి గోడు విన్న ఎమ్మెల్యే వెద్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ ఫారెస్ట్ అధికారుల వేధింపులకు ఎవరు భయపడొద్దని , గ్రామాన్ని తరలించేది ఉంటే జన్నారం మండలం పరిధిలోనే ఎక్కడైనా స్థలాలు కేటాయించాలని, లేదంటే గ్రామాన్ని వదిలేది లేదు మీకు అండగా నేను ఉంటానని హామీ ఇచ్చారు . ఈ సమస్య కి పరిష్కారం కొరకు అసెంబ్లీ లో కూడా ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు.గ్రామస్తులకు న్యాయం జరిగే విధంగా ఉంటానని , గ్రామాల్లో నీటి సౌకర్యం, పాఠశాల , అంగన్వాడీ ఎలాంటి సమస్యలు ఉన్న త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, గ్రామస్తులు,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిర్పూర్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకట్రావ్‌పేట్ చెక్‌పోస్ట్ సమీపంలో పోలీసులు,సివిల్ సప్లై అధికారులు సంయుక్తంగా తనిఖీలు



**మార్చ్ 12, సిర్పూర్(టి) నియోజకవర్గం.ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండల కేంద్రంలోని వెంకట్రావుపేట్ చెక్పోస్ట్ సమీపం లో సిర్పూర్(టి)పోలీసులు సివిల్ సప్లై అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి 9 కింటల్లా పిడిఎఫ్ బియ్యం 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని 7 గురిని అదుపులో తీసుకొని కేసు నమోదు చేశారు.దర్యాప్తుల భాగంగా మహారాష్ట్రలోని పోడ్సా గ్రామంలో సోదాలు నిర్వహించి 43 కింటల్లో తెలంగాణ పిడిఎస్ బియ్యం ఒక బొలెరో వాహనాన్ని స్వాధీనంచేసుకున్నారు.స్వాధీనం చేసిన తెలంగాణ పిడిఎస్ బియ్యం విలువ సుమారు రూ"1,50.000 ఉంటుందని తెలిపారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

## సిఐ రమేష్ - ఎస్సై ఇమ్రాన్ ఖాన్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు

**నేరడిగొండ మార్చి 12(ప్రజాజ్యోతి ):** నేరేడిగొండ మండలం వడూర్ గ్రామంలో గురువారం పోలీస్ శాఖ సీఐ రమేష్, ఎస్సై ఇమ్రాన్ ఖాన్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలు, ఫోర్ వీల్ వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలతో సమావేశమై చట్టాలు రోడ్డు భద్రత నియమాలు నిబంధనలు మరియు సామాజిక భద్రతపై అవగాహన కల్పించి. చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని నియమ నిబంధనలు పాటించాలని సూచించారు.ఈ సందర్భంగా గ్రామంలో గల వాహనాలను తనిఖీలు నిర్వహించగా మొత్తం 97 ద్విచక్ర వాహనాలను తనిఖీ చేయగా సరియైన పత్రాలు నంబర్ ప్లేట్స్ లేని 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. 36 వాహనాల చాలన్లు పెండింగ్ లో ఉన్న వాటిపై జరిమానా విధించి రూపాయలు 23,515/-వసూలు చేశారు.

# కొండాపూర్ హైవేలో ఘోర ప్రమాదం టైరు పగిలి బోల్తా పడ్డ ఐచర్





**ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి**

**రోడ్డు ప్రమాద క్షతగాత్రులను పరామర్శించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల**

**ఖానాపూర్ మార్చి 12 (ప్రజా జ్యోతి ):** నిర్మల్ జిల్లా కొండాపూర్ హైవేలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగి ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు టైరు పగలడంతో ఐచర్ వాహనం అదుపుతప్పి పల్టీ కొట్టడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు తెలిసిన వెంటనే ఎస్పీ ఘటన స్థలాలతోపాటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షత్రగాతులను పరామర్శించారు ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని సోంపల్లి గ్రామం నుండి నిజాంబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే పెళ్లికి 21 మందితో వెళ్తున్న బొలెరో మ్యాక్స్ ఐచర్ వాహనం కొండాపూర్ సమీపంలో టైర్ పగలడంతో, వాహనం అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న 21 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు, స్థానికులు స్పందించి గాయపడిన వారిని అంబులెన్స్ లో వెంటనే నిర్మల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో లక్ష్మణ్ (60), తులసీ దాస్ (38) మృతి చెందగా, ఇద్దరి పరిస్థితి సీరియస్ గా ఉండటంతో,ఆదిలాబాద్ రిమ్స్ కి తరలించారు.మిగిలిన వారు నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రమాదానికి గురైన క్షతగాత్రులను పరామర్శించడానికి జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని, గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అవసరమైన అన్ని వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. అలాగే బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పి, పోలీసులు అన్ని విధాలుగా సహకరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రమాదాల్ని నివారించేందుకు ఎక్కడికైనా ప్రయాణం చేసేందుకు వెళ్లేటప్పుడు వాహనం యొక్క స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించి ముఖ్యంగా రానున్న వేసవిలో వాహన టైర్లను పరిశీలించాలని ఎండాకాలం వేడికి టైర్లు సరిగా లేకపోతే పగిలే అవకాశం ఉందని ప్రయాణికులతో పాటు వాహనదారులు డ్రైవర్లు గమనించాలని అన్నారు

# ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామ ని చెప్పి నిరుద్యోగ యువతిని మోసం చేసిన ఇద్దరు అరెస్ట్, రిమాండ్

**బాధితురాలి వద్దనుండి 50, 000 డిమాండ్, రూ 15,000 వసూలు**

**జాబ్ పేరుతో మోసం చేసే వా రి పట్ల కఠిన చర్యలు తప్పవు**

**గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్ లో కేసు, రిమాండ్ తరలింపు**

**ఆదివాసీ నాయకులంటూ మోసం చేసిన నిందితులు**

**ప్రజలు అప్రమత్తంగా ఉండా లని సూచన**

**ఇంకా బాధితులు ఎవరైనా నిర్భయంగా పోలీసులను సం ప్రదించవచ్చు**

**గుడిహత్నూర్ ఎస్సై ఎల్ శ్రీ కాంత్**

**గుడి హత్నూర్, మార్చి 12, (ప్రజా జ్యోతి):** ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామ ని చెప్పి నిరుద్యోగ యువతిని మోసం చేసి డబ్బులు వసూ లు చేసిన ఇద్దరు నిందితుల ను గుడిహత్నూర్ ఎస్ఐ ఎల్ శ్రీకాంత్ అరెస్ట్ చేసినట్లు తెలి పారు. గుడిహత్నూర్ మండ లం సీతగొండి గ్రామానికి చెం దిన ఓ యువతిని ఈ ఇద్దరు నిందితులు ఆదివాసీ నాయ కుల పేరుతో, తమకు ఉన్న ప రిచయాలతో, ప్రభుత్వ ఉద్యో గం ఇప్పిస్తామని నమ్మబలికి డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో నిందితులు ఎ1) ఆత్రం గణపతి ఏ గుణ వంత్ (53) o/శీ రాజు, నివా సం: మావల గ్రామం, ఆదిలా బాద్ జిల్లా. ఎ2) సలాం వరు ణ్ (27) ఏ సలాం ఆరుణ్ కు మార్ o/శీ దాము, ఆదివాసి స్టూడెంట్ యూనియన్ జిల్లా సెక్రటర్, నివాసం: రామ్నగర్, ఆదిలాబాద్ పట్టణం.నిందితు లు ఇద్దరూ తమ పలుకుబ డిని ఉపయోగించి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి మొదట రూ.1,00,000/- డి మాండ్ చేశారు. బాధితురా లు పేద కుటుంబానికి చెం ది నదని చెప్పడంతో రూ.50,0 00/- ఇవ్వాలని ఒప్పించారు. ఈ క్రమంలో బాధితురాలు 2024 ఆగస్టు నెలలో రెండు విడతల్లో ఫోన్‌పే ద్వారా మొత్తం రూ.15,000/- నిందితులకు పంపింది. అనంతరం ఉద్యోగం ఇప్పించకుండా నిందితులు ఆమెను తప్పించుకుంటూ వచ్చారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగినప్పుడు కూడా బెదిరింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి కొంత నగదు స్వాధీనం చేసుకున్నారు. న్యాయస్థానంలో హాజరుపరచగా కోర్టు ఆదేశాల మేరకు వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌ఓ శ్రీకాంత్ తెలిపారు. ప్రజలు ముఖ్యంగా నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో డబ్బులు అడిగే వ్యక్తులను నమ్మవద్దని, ఎవరైనా ఈ విధంగా మోసం చేయడానికి ప్రయత్నిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. వీరి వల్ల మోసపోయిన బాధితులు ఇంకెవరైనా ఉన్నట్లయితే వెంటనే జిల్లా పోలీసులను సంప్రదించవచ్చని తెలిపారు.



# నీతి అయోగ్ ఎంపికైన పెంబి బ్లాక్ అవార్డు

**ఖానాపూర్ మార్చ్ 12( ప్రజా జ్యోతి):** ఖానాపూర్ నియోజకవర్గంలోని గిరిజన మండలం పెంబి బ్లాకు నీతి అయోగ్కు ఎంపికై అవార్డును జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మండల అధికారులు మండల ప్రజాప్రతినిధులు అందుకున్నారు తెలంగాణ రాష్ట్రంలో రెండు జిల్లాలు ఎంపిక కాగా అందులో నిర్మల్ జిల్లా ఎంపికై ఖానాపూర్ నియోజకవర్గం లోని పెంబి నీతి అయోగ్ లో ప్రశంస పొందడం, ఈ మేరకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఇటీవల విశాఖపట్నంలో జరిగిన సెమినార్లో దీనిపై పూర్తి సమాచారాన్ని వివరించి ప్రశంస పత్రం అవార్డు తీసుకురావడం జరిగింది దీన్ని ప్రశంసించిన ఖానాపూర్ శాసనసభ్యులు వెడమ బొజ్జు పటేల్తో సహా గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలోని అందరు ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేలు రామారావు పటేల్ బొజ్జపటేల్ తొపాటు అందరు అధికారుల సమక్షంలో ఈ వార్డును పెంబి మండలానికి అందించడం గమనార్హం అని ఎంబి మండల కేంద్రం సర్పంచ్ మల్లెపల్లి సత్యనారాయణ స్వామి అన్నారు ఈ మండలంలో అధికారుల శ్రమ ప్రజల సహకారం మరువలేనిదని సర్పంచ్ స్వామి అన్నారు

# 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి జిల్లాకు పేరు తేవాలి కలెక్టర్ అభిలాష అభినవ్ వెల్లడి



**ఖానాపూర్ మార్చి 12 (ప్రజా జ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా క్షేత్రస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు. జిల్లాలోని నిర్మల్ ఖానాపూర్ మొదలు నియోజక వర్గాల గురువారం జిల్లా కేంద్రంలోని తిరుమల గార్డెన్ లో నిర్వహించిన అవగాహనా సమావేశంలో నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్, ముధోల్ శాసనసభ్యులు రామారావు పటేల్ లతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు ప్రతి గడపకూ చేరాలని, అభివృద్ధి పనుల్లో ఎక్కడా జాప్యం జరగకూడదని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. అనంతరం, మండలాల వారీగా విచ్చేసిన సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లతో కలెక్టర్ విడివిడిగా భేటీ అయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, వారితో కలిసి సామూహికంగా చాయ చిత్రాలు (ఫోటోలు ) దిగారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో కేసీఆర్ పథకం అందని ఇళ్లు లేదు





- హనుమంతుని గుడి లేని ఊరు లేదు
- హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- గ్రామంలోని కలిని తొక్కడానికే ఆంజనేయ స్వామిగా శివుని అవతారం
- గంగాపూర్ హనుమాన్ ఆల యం నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం రూ. 50 లక్షలు మంజూ రు

**బజార్ హత్నూర్, మార్చి 12, (ప్రజా జ్యోతి):** తెలంగాణలో తొలి ముఖ్య కేసీఆర్ ప్రవేశ పెట్టిన పథకం అందని ఇళ్లు లేదని, హను మంతుని గుడి లేని ఊరు లేద ని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్పష్టం చేశారు. బజార్ హ త్నూర్ మండలంలోని గంగా పూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ హనుమంతుని ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా పన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ ఎమ్మెల్యే అని ల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్ర త్యేక పూజలు నిర్వహించి శిఖర ఆవిష్కరణ వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ తె లంగాణలో కేసీఆర్ పథకం అందని ఇళ్లు లేదని, హను మంతుని గుడి లేని ఊరు లే దని అన్నారు. గ్రామానికి అం దగా ప్రతీ గ్రామంలో హను మంతుని గుడి ఉంటుందని అన్నారు. ఈరోజు గంగాపూర్ గ్రామం చిన్న గ్రామమైన భక్తి శ్రద్ధలతో గ్రామంలో అద్భుత మైన హనుమాన్ ఆలయాన్ని నిర్మించడం గొప్ప విషయమ ని అన్నారు. ఆలస్యంగా కట్టి న గంగాపూర్ గ్రామస్తులు అద్భుతంగా నిర్మించారని, కలి యుగంలో గ్రామాలు బాగుండాలని కలిని తొక్కడానికే ఆం జనేయ స్వామిగా శివుడు అవతరించారని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నా రు.

# జనగణన-2027 జిల్లా, ఛార్జ్ స్థాయి అధికారుల శిక్షణా కా ర్యక్రమంపై కలెక్టర్ సమీక్ష



**ఆదిలాబాద్ బ్యూరో, మార్చి 12, (ప్రజా జ్యోతి):** 'హౌస్‌లిస్టింగ్, హౌసింగ్ సెన్స స్' ప్రక్రియ పారదర్శకంగా, ఖ చ్చితత్వంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికా రులను ఆదేశించారు. గురు వారం కలెక్టరేట్ సమావేశ మందిరంలోజనగణన-2027'లో భాగంగా 'హౌస్‌లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్' ప్రక్రియపై నిర్వహించిన అవగాహన కా ర్యక్రమంలో ఆయన పాల్గొ న్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హెచ్.ఎల్.బి క్రియేటర్ అప్లికేషన్ వినియో గం, పటాల తయారీ, సెల్ఫ్ ఎన్యూమరేషన్ వంటి కీలక అంశాలపై అధికారులకు అ వగాహన కలిగి ఉండాలన్నా రు. ప్రతి ఎన్యూమరేషన్ బ్లాక్ పరిధిని స్పష్టంగా గుర్తించి, స రిహద్దులను నిర్ణయించడంలో హెచ్.ఎల్.బి క్రియేటర్ వెబ్ మ్యాపింగ్ అప్లికేషన్‌ను సమ ర్థవంతంగా వినియోగించు కో వాలని సూచించారు. ము ఖ్యంగా గ్రామీణ, పట్టణ ప్రాం తాల్లో వార్డుల విభజన, స్లమ్ ఏరియాల గుర్తింపు, జియో- ట్యాగింగ్ ప్రక్రియను నిశితంగా చేపట్టాలన్నారు. రెవెన్యూ గ్రా మాలు, పట్టణ వార్డులే ప్రాథ మిక యూనిట్లుగా ఈ గణన జరుగుతుందని స్పష్టం చేశా రు. డిజిటల్ జనగణనలో భా గంగా ప్రవేశపెట్టిన 'సెల్ఫ్ ఎ న్యూమరేషన్' (స్వయం గణ న) విధానంపై ప్రజలకు విస్తృ త అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇంటి యజమా నులు తమ సమాచారాన్ని ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా స్వ యంగా నమోదు చేసుకునేం దుకు వీలుగా 15 రోజుల పా టు పోర్టల్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజ లు నమోదు చేసిన సమాచా రాన్ని ఎన్యూమరేటర్లు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ధృవీ కరిస్తారని వివరించారు. ఈ ప్రక్రియ అంతా పారదర్శకంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయా లని అధికారులను ఆయన ఆ దేశించారు. ఈ అవగాహన కా ర్యక్రమంలో ఐటిడిఏ పీఓయు వరాజ్ మర్మాట్, కలెక్టరేట్ ప ర్యవేక్షకురాలు పంచాపూల, తహాశీల్దార్లు, ఎంపీడీవో లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

# పార్టీలు ఏవైనా, ప్రభుత్వాలు ఏవైనా సర్పంచులు ప్రజల్లో ఉండాలి

**ఆదిలాబాద్ బ్యూరో, మార్చి 12, (ప్రజా జ్యోతి):** పార్టీలు ఏవైనా ప్రభుత్వాలు ఏమైనా సర్పంచులు ప్రజల్లోనే ఉండాలని నియోజకవర్గం అయితే గ్రామానికి సర్పంచ్ ప్రథమ పౌరుడని పార్టీలకు అతీతంగా సర్పంచులు గ్రా మాల అభివృద్ధికి పాటు పడా లని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జా దవ్ పిలుపునిచ్చారు.ఆదిలా బాద్ జిల్లా కేంద్రంలోని రెవె న్యూ గార్డెన్ లో అధికారికంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నూ తన సర్పంచులతో నిర్వహిం చిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజ రయ్యారు. ఈ సందర్భంగా ఎ మ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లా




డుతూ గ్రామంలో సర్పంచే ప్రథమ పౌరుడని, సర్పంచ్ గా సక్రమంగా పనులు చేస్తేనే గ్రా మంలో భవిష్యత్తు ఉంటుంద ని అన్నారు. పార్టీలు, ప్రభు త్వాలు ఏవైనా ప్రజల్లో ఉండ టం గ్రామంలోని కష్ట సుఖల్లో ఉండటమే లక్ష్యంగా ముందు కుసాగాలని అన్నారు.



# బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

- జాదవ్ ప్రేమ్సింగ్ కి తక్షణ సహాయం కింద రూ. 30 వేలు అందజేత

**నేరడిగొండ మార్చి 12( ప్రజాజ్యోతి ):** నెరడిగొండ మండలంలోని బొరిగామ గ్రామంలో ప్రమాదవశాత్తుగా జరిగిన అగ్ని ప్రమాద స్థలాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు ఇండ్లు, మూడు పశు వుల పాకలు కాలిపోవడం బాధాకరమని తప్పకుండా ఇండ్లు కోల్పోయిన ప్రతీ ఒక్కరికీ త్వరలోనే ఇండ్లు మంజూరు చేసే బాధ్యత తీసుకుంటానని అన్నారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం తరపున అందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. ఇండ్లు పూర్తిగా దగ్ధమైన జాదవ్ ప్రేమ్సింగ్ కి వ్యక్తిగతంగా రూ. 30 వేలు తక్షణ సహాయం అందజేశారు. అదేవిధంగా బాధితులకు నిత్యావసర సరుకులను అందించారు. వీరి వెంట అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గా అశోక్ ముస్తాపురే



**ఆదిలాబాద్ బ్యూరో, మార్చి 12, (ప్రజా జ్యోతి):** బిజెపి తెలంగాణ రాష్ట్ర అధి కార ప్రతినిధిగా ఆదిలాబాద్ జిల్లా నుంచి అశోక్ ముస్తాపూ రే ను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రామ చంద్రరావు ఉత్తర్వులు జారీ చేశారు. మొట్ట మొదట తెలు గుదేశం పార్టీలో రాజకీయ ఆ రంగేట్రం చేసిన ముస్తాపురే అశోక్ తెలుగుదేశం పార్టీ తర ఫున ఇచ్చోడ జెడ్పి టిసిగా పో టీ చేసి గెలుపొందారు. ఆ త ర్వాత ఆయన తెలుగుదేశం పార్టీలోనే కొనసాగారు. బి ఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం అ నంతరం ఆ పార్టీలో చేరి తెలం గాణ ఉద్యమంలో కీలకంగా చురుకుగా పని చేశారు. తె లంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏ ర్పడిన అనంతరం కొన్ని రోజు లు బిఆర్ఎస్ పార్టీలో నూ ప నిచేశారు. గత అసెంబ్లీ ఎన్ని కల ముందు ఆయన బిజెపి లో చేరారు. బిజెపిలో తనదైన ముద్ర వేసుకుంటున్నారు. పార్టీ కార్యకలాపాలలో విస్తృతంగా పాల్గొంటూ పార్టీ పటిష్టతకు తనవంతుగా కృషి చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఆదిలాబాద్ ఇన్చార్జిగా కొనసాగి ఎమ్మెల్యే పాయల్ శంకర్ గెలుపుకు ఆయన విశేష కృషి చేశారు అనంతరం జరిగిన పార్లమెంటు ఎన్నిక ల్లోను ఆయన ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్చార్జిగా వ్యవ హరించి ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ గెలుపుకు కృషి చేశారు. దీంతో పార్టీ అధిష్టానం గుర్తిం చి ఆయనకు తెలంగాణ రా ష్ట్ర అధికార ప్రతినిధిగా నియ మిస్తూ ఉత్తర్వులు జారీ చేసిం ది. తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన బిజె పి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షు లు రామచంద్రారావు కుఅశోక్ ముస్తాపూరే హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.పార్టీ పెద్దలు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, ఎంపీ గోడెం నగేష్, ఆదిలా బాద్ ఎమ్మెల్యే పాయల్ శంక ర్ తో పాటు పార్టీ పెద్ద లంద రికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తరఫున ప్రజ ల సమస్యలపై గళం వినిపి స్తూ, తెలంగాణలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృ షి చేస్తానని ఆయన పేర్కొన్నా రు.పార్టీ నాయకత్వం ఇచ్చిన ఈ బాధ్యతను పూర్తి స్థాయి లో నెరవేర్చేందుకు కట్టుబడి ఉంటానని అశోక్ ముస్తాపూరే తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'ప్రజా పాలన - ప్రగ తి ప్రణాళిక

**ఆదిలాబాద్ బ్యూరో, మార్చి 12, (ప్రజా జ్యోతి):** జిల్లాలో "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" లో భాగంగా 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నా రు. గురువారం స్థానిక రెవె న్యూ గార్డెన్ లో ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సర్పం చ్ లు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల శిక్షణ కార్యక్రమంలో ఆ దిలాబాదు, బోథ్ ఎమ్మెల్యేలు పాయల శంకర్, అనిల్ జాద వ్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి ప్రసంగించారు ముందుగా జిల్లాలో 99 రోజు ల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వైద్యారోగ్య శాఖ, వ్యవసాయ శాఖ (రైతు భరోసా, రుణమాఫీ), విద్యాశాఖ (అమ్మ ఆదర్శ పాఠశాల), ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ద్వారా చేపడుతున్న కార్యకలాపాలు, పోలీస్ శాఖ ఆధ్వ ర్యంలో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా కార్యక్రమం, అటవీ శాఖ ద్వారా పర్యావరణ పరిరక్షణపై సంబంధిత, ఇతర శా ఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ జిల్లా లో "ప్రజాపాలన - ప్రగతి ప్రణా ళిక" లో భాగంగా 99 రోజుల ప్రత్యేక కార్యాచరణను విజయవంతం చేయాలని, ఈ ప్ర త్యేక కార్యక్రమం మార్చి 6న ప్రారంభమై జూన్ 12 వరకు కొనసాగుతుందని అన్నారు. జూన్ 2వ తేదీన రాష్ట్ర అవత రణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని, గ్రామ, వార్డు స్థాయిలో పండుగ వాతావరణంలో కార్యక్రమాలు నిర్వ హించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీన అన్ని గ్రామా ల్లో గ్రామ సభలు, వార్డుల్లో వా ర్డు సభలు నిర్వహించి, అభి వృద్ధి పనులపై సమీక్ష జరపా లని ఆదేశించారు. ప్రణాళిక లో భాగంగా మార్చి 6 నుండి 15 వరకు పరిశుభ్రతలో భా గంగా గ్రామాల్లో, ప్రభుత్వ కా ర్యాలయాల్లో పారిశుధ్య ప నులు, పెండింగ్ ఫైళ్ల క్లియరె న్స్.ఏప్రిల్ 6 నుండి 11 వరకు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్ర త్యేక డ్రైవ్. మే 4 నుండి 9 వ రకు రైతు సంక్షేమంలో భాగం గా వ్యవసాయం, రెవెన్యూ, నీ టి పారుదల శాఖల సమన్వ యంతో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమం, ఇందిరమ్మ ఇళ్లు, ఆరు గ్యారంటీల అమలుపై దృష్టి, పిల్లల రక్షణ 'డ్రగ్స్ కు నో' ప్రచారం, విద్య, యువత- క్రీడలు, మహిళా సాధికారత, పర్యావరణ



పరిరక్షణ వంటివి అమలు చేయడం జరుగు తుందని వివరించారు. కొత్తగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్లకు ఇ ది మొదటి శిక్షణ అని, సర్పం చ్ లు, కౌన్సిలర్లు సమన్వ యంతో పని చేసి జిల్లాను రా ష్ట్రం లోనే ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. ఆదిలా బాద్ శాసన సభ్యులు పాయ ల శంకర్ మాట్లాడుతూ, సంక్షే మ, అభివృద్ధి పథకాలను అ ర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయ డమే ఈ కార్యక్రమ ముఖ్య ఉ ద్దేశమని అన్నారు. ప్రజల అవ సరాలను గుర్తించి క్షేత్రస్థాయి లో సమస్యలను పరిష్కరించ డంలో సర్పంచ్‌లు, కౌన్సిలర్లు కీలక పాత్ర పోషించాలని సూ చించారు. బోథ్ శాసన సభ్యు లు అనిల్ జాదవ్ మాట్లాడు తూ, ప్రజా ప్రతినిధులు అభి వృద్ధి, సంక్షేమ పథకాలపై పూ ర్తి అవగాహన కలిగి ఉండాల ని, నిత్యం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సా రించాలని, మనం చేసిన పనుల ఆధారంగానే ప్రజలు భవి ష్యత్తులో మనల్ని ఎన్నుకుంటారని తెలిపారు. అనంతరం రైతులకు ఉచితంగా అందించేందుకు 500 రూపాయల విలువగల ఐదు రకాల కూరగాయల విత్తనాల కిట్ ను కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, డిఆర్డీఓ రవీందర్, డిపిఓ రమేష్, అదనపు ఎస్పీలు సురేందర్ రావు, మౌనిక, మున్సిపల్ వైస్ చైర్మన్ రోహిత్, జిల్లా ఉద్యానవన అధికా రి నర్సయ్య, మున్సిపల్ కమిషనర్ రాజు, సర్పంచ్ లు, ము న్సిపల్ వార్డుల కౌన్సిలర్లు, వివిధ శాఖల జిల్లా అధికారు లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నీతి నిజాయితీగా కష్టపడి ప ని చేస్తే ఇప్పటికైనా గుర్తింపు

**సిరికొండ, మార్చి 12,( ప్రజా జ్యోతి):** నిజాయితీగా, నిస్వార్థంగా, కష్టపడి పని చేసే ప్రభుత్వ ఉద్యోగులకు, ఎప్పటికైనా మంచి గుర్తింపు లభిస్తుందని, స్వార్థం కోసం కాకుండా పద వికి, ఉద్యోగానికి గుర్తింపు ల భించే విధంగా, అంకిత భావం తో ఉద్యోగులు పనిచేయాలని రాయగూడ సర్పంచ్ పెందూర్ లక్ష్మణరావు పేర్కొన్నారు.సిరి కొండ మండలంలోని రాయి గూడ గ్రామంలో ఆశ్రమ పాఠ శాల ప్రధాన



ఉపాధ్యాయులు ఆత్రం భాస్కర్ కి రెండవ సారి ఐటీడీఏ పివిటీజీ ఏపీఓగా ని యమితులైన సందర్భంగా ఈ రోజు రాయిగూడ గ్రామ స్థానిక సర్పంచ్, గ్రామస్తులు ఈరోజు ఆశ్రమ పాఠశాల లో మర్యాద పూర్వకంగా కలిసి ఆత్రం భాస్కర్ ని ఘనంగా స న్మానించిన స్థానిక సర్పంచ్ పెందూర్ లక్ష్మణ్ రావు, గ్రామ పటేల్ హన్మంతరావు, రాయి సెంటర్, సార్ మెడి అమృత్ రావు, గ్రామస్తులు. అనంతరం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్నులు, ఐటీడీఏ ఏపిఓ ఆత్రం భాస్కర్, స్థానిక సర్పం చ్ పెందూర్ లక్ష్మణ్ రావు గారి చేతులు మీదుగా అంద జేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జుగ్నక్ కృష్ణ, మహాజన్ సిడం మాధవ్, దేవ రి పంద్రం శ్రీకాంత్, జంగుబా పు, పాఠశాల ఉపాధ్యాయు లు ముకుంద్ , రాం కుమార్, కేశవ్, గణేష్, గజనంద్, తదితరులు పాల్గొన్నారు.



## సీతారాముల కళ్యాణం కోసం విరాళం

**లక్ష్మణ చాంద, మార్చ్ 12 (ప్రజా జ్యోతి) :** లక్ష్మణ చాంద మండలంలోని చామనపల్లి గ్రామంలో గల సీతా రామాలయంలో రాబోయే శ్రీరామనవమి సందర్భంగా జరిగే సీతారాముల కళ్యాణానికి గ్రామ సర్పంచ్ ఐట్ల లక్ష్మీ సుదర్శన్ తమవంతుగా విరాళంగా 11 లక్షల11 వేల 11 రూపాయల చెక్కును గురువారం రోజున గ్రామస్తులకు, రామాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఇంత భారీ మొత్తంలో విరాళాన్ని అందించిన గ్రామ సర్పంచ్ కు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజకీయంగా ఎదుర్కోలేక ఇ మ్మడి గోపి పాషవిక హత్య

**ముదిరాజ్ సంఘం నేతల తీవ్ర ఖండన**

**ఆదిలాబాద్ బ్యూరో మార్చి 12 (ప్రజా జ్యోతి):** నిజామాబాద్ జిల్లా ముదిరా జ్ మహాసభ మాజీ అధ్యక్షు లు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప నిచేస్తున్న ధర్పల్లి మాజీ ఎంపీ పీ ఇమ్మడి గోపి ముదిరాజును దారుణంగా హత్య చేయడం పట్ల మన ముదిరాజ్ మహాస భ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సై లేంద్ర శివయ్య ముదిరాజ్, అ ఖిల భారత కోలి సమాజ్ జా తీయ కార్యవర్గ సభ్యులు బొ జ్జ నారాయణ ముదిరాజ్, యువజన విభాగం జిల్లా అ ధ్యక్షులు కంచం లక్ష్మణ్ ము దిరాజ్ , తెలంగాణ రాష్ట్ర ము దిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షు లు దార్ల శ్రీనివాస్ ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి చాగంటి భ గవాండ్లు, ముదిరాజ్ పట్టణ అధ్యక్షులు ధారవేనీ రాము ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి దార్ల రవి ముదిరాజ్, కోశా ధికారి బొజ్జ సంతోష్ ముది రాజ్, పట్టణ ఉపాధ్యక్షులు బొమ్మెన లక్ష్మన్న ముదిరాజ్, సలేంద్ర రాజు ముదిరాజ్, త దితరులు తీవ్రంగా ఖండించా రు. రాజకీయంగా ఎదుగుతు న్న ఇమ్మడి గోపిని పథకం ప్ర కారం హత్య చేశారని ఇది ఎం త మాత్రం సహించేది లేదని, దోషులు ఎంతటి వారైనా వా రిని అరెస్టు చేసి కఠినంగా శి క్షించాలని ముదిరాజ్ సంఘా ల నేతలు డిమాండ్ చేశారు. రాజకీయంగా గోపి ఎదుగుద లను అడ్డుకోలేకే కొందరు కు ట్ర చేసి దారి కాచి హతమార్చ డం పెరికిపందల చర్య అని ముదిరాజ్ సంఘం నేతలు అభివర్ణించారు. ఇలాంటి సం ఘటనలు పునరావృతం కా కుండా ప్రభుత్వం ప్రత్యేక చ ర్యలు చేపట్టాలని ముదిరాజ్ సంఘం నేతలు డిమాండ్ చే శారు. గోపి హత్య చేసిన వారి ని చట్టం ప్రకారం కఠినంగా శి క్షించి ఆయన కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాల ని మహాసభ నేతలు విజ్ఞప్తి చేశారు.

## కరెంటు షార్ట్ సర్క్యూట్ తో మూడు ఇల్లు రెండు కొట్టాలు దగ్ధం

**నేరడిగొండ,మార్చి 12 (ప్రజాజ్యోతి ):** నేరడిగొండ మండలంలోని బోరిగాం గ్రామంలో గురువారం సంభవించిన ఘోర అగ్నిప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. కరెంట్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి క్షణాల్లోనే వ్యాపించి భీభత్సాన్ని సృష్టించాయి. ఈ ప్రమాదంలో మూడు నివాస గృహాలతో పాటు రెండు పశువుల కొట్టాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. మంటల ధాటికి ఇళ్లలో ఉన్న నిత్యావసర వస్తువులు, నగదు, ధాన్యం మరియు ఇతర విలువైన సామాగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో గ్రామస్థులు మంటలను అదుపు చేసేందుకు శతవిధాలా ప్రయత్నించినప్పటికీ అప్పటికే భారీ నష్టం సంభవించింది. సమాచారం అందుకున్న వెంటనే ఇచ్చోడ నుంచి ఫైర్ ఇంజన్ సంఘటనా స్థలానికి చేరుకుని గంటల తరబడి శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.